

ఉచిత క్షవర సేవ

ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో పంబి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పంబి శ్రీనివాస్, ఆయన కుమారులు వృద్ధులకు ఉచితంగా క్షౌ రసేవలు చేశారు. 'మానవ సేవే మాధవ సేవ'అనే నినాదంతో వృద్ధులకు తమ వంతుగా క్షౌ ర సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పరులకు సేవ చేయడంలో మనసుకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. – ఆల్విన్‌కాలనీ

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు మూసాపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగం, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు గోపాల్‌నగర్‌కాలనీ, కేపీహెచ్‌బీ 2, 3 సర్వీస్ రోడ్డు, నేతాజీ నగర్ పార్కు పరిసరాల్లో మంగళవారం ఆక్రమణల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పాదచారుల హక్కులు, భద్రత దృష్ట్యా, ప్రయాణికుల సౌలభ్యం కోసం మరిన్ని ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు వ్యాపారులు, షాప్ కీపర్లు ఫుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. కూకట్‌పల్లి జోన్‌లోని అన్ని సర్కిళ్లలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కోసం రెగ్యులర్ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని ఆమె తెలిపారు. – కూకట్‌పల్లి

ఆక్రమణల తొలగింపు..







ఇఫ్తార్..

అల్లాపూర్ డివిజన్‌లో ఎస్‌డీ ఫంక్షన్‌హాల్‌లో మైనార్టీ నాయకుడు అజీమ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, యువ నాయకుడు రినీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. – మోతీనగర్

2027 నాటికి భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారవచ్చు

- భారతదేశం 62.5 శాతం శ్రామిక జనాభాను కలిగి ఉంది
- సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ డా.బీవీఆర్ మోహన్‌రెడ్డి

రాయదుర్గం: భారతదేశం 2027 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారవచ్చని సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్వర్ణోత్సవం, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సిల్వర్‌జూబ్లీ వేడుక వేళ 25 విశిష్ట ఉపన్యాసాల శ్రేణిని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన దేశం పదేళ్ల కాలంలో 7 శాతం జీడీపీ వృద్ధి రేటుతో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారామన్నారు. భారతదేశంలో 62.5 శాతం మంది శ్రామిక జనాభా ఉన్నారని, ఉత్పాదకత, వినియోగం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించగలదన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను అమలు చేస్తోందని, తయారీ, ఉద్యోగ కల్పనను పెంచడానికి మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్య యొక్క నాణ్యత, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ అండ్ డీ, సాంకేతికతలలో ఆవిష్కరణలలో పెట్టుబడులు పెట్టడం అవసరమన్నారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మానవ శక్తిని అధిగమిస్తోందన్నారు. సాంకేతిక ఆధారిత ఆర్థిక వ్యవస్థ కోసం నాణ్యమైన విద్యను అందించా లన్నారు. పరిశోధన, అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. యువత వీలైనంత కష్టపడి పనిచేయాలని, ఇదే ఎదగడానికి సహాయపడుతుందన్నారు.

రూ.20 లక్షల పెట్టుబడి.. రూ.25వేల కోట్లు

30 ఏళ్ల క్రితం రూ.20 లక్షల పెట్టుబడి, నలుగురు ఇంజనీర్లతో ప్రారంభమై ప్రస్తుతం 18వేల మంది ఇంజనీర్లతో 14 దేశాలలో రూ.25 వేల కోట్ల సంస్థను నిర్మించామన్నారు. భారతదేశంలో 140 కోట్ల జనాభాలో 16 నుంచి 60 ఏళ్ల లోపువారు 62.5శాతం మంది ఉన్నారని, వీరిందరిలో శ్రమించే శక్తి ఉందని, వీరు తలచుకుంటే ఏదైనా సాధ్యమని ఆయన అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, డాక్టర్ పూనమ్‌సింగ్, ప్రొఫెసర్ ఐరాల లంకానంద్‌రెడ్డి ప్రసంగించారు.

మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

- కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ • ఈనెల 29న కార్యకర్తల సమావేశం నేపథ్యంలో నేతలకు సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



కేపీహెచ్‌బీ నుంచి కాంగ్రెస్ పార్టీ చేరిన మహిళలతో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు

బాలానగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి గెలుపే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ పిలుపునిచ్చారు. ఈనెల 29న కూకట్‌పల్లి ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో మంగళవారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు సమావేశంపై పలు సూచనలు చేశారు.

◆ ఎంతో ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా ఉండటమే పెద్ద పదవి అని అన్నారు. ఇలాంటి పార్టీ గెలుపు కోసం పనిచేయటం ప్రతి కార్యకర్త ఒక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి బ్రహ్మాండమైన ఆదరణ లభిస్తోందన్నారు. గతంలో పార్టీలో కొన్ని చిన్న పొరపాట్లు జరిగినా ప్రస్తుతం సీనియర్లు, జూనియర్లు అందరిని కలుపుకుంటూ సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నామన్నారు. పనిచేసే వారికి ప్రభుత్వంలో ఎప్పుడూ తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. పార్టీకి చెందిన అన్ని కమిటీల్లోను స్థానికులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

◆ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలతో మమేకమైతేనే నాయకుడిగా ఎదగగలుగుతారని సూచించారు. 29వ తేదీన జరిగే కార్యకర్తల సమావేశం విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.10కోట్లు కేటాయించారని తెలిపారు. అధిష్టానంతో పోరాడి జనాభా ప్రాతిపదికన మరిన్ని నిధులు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, పుష్పరెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు....

కేపీహెచ్‌బీకి చెందిన ఎస్ఎల్ఎఫ్ నేత సుందరి తన అనుచరులు 30 మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ నాయకురాలు రజిత ఆధ్వర్యంలో బండి రమేష్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి సునీతా మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని.. ఆ దిశగా పని చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరిన మహిళలకు మరోసారి స్వాగతం పలుకుతున్నామని అన్నారు.

రసాభాసగా బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం

హైదరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ అధ్యక్షన జరిగింది. అయితే, సమావేశంలో స్టేజీపైనే మాగంటి గోపినాథ్, రావుల శ్రీధర్‌రెడ్డి దూషించుకున్నారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని రావుల కోరగా.. 'గత ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పనిచేసిన నిన్ను ఎవరు పిలిచారు' అంటూ మాగంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాకు చెప్పడానికి నువ్వు ఎవరివి' అంటూ రావుల రెచ్చిపోవడంతో పరస్పర దూషణలతో వాతావరణం వేడెక్కింది. దీంతో అక్కడే ఉన్న మాజీ మంత్రి తలసాని ఇరువురినీ సముదాయించారు. వీరిద్దరూ వాగ్వాదం చేసుకోవడంతో కొద్దిసేపు సమావేశం రసాభాసగా మారింది. ఇదిలా ఉండగా పార్టీ నేతలే తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ కేటీఆర్ ముందు కొందరు నేతలు ఎఫ్ఐఆర్ కాపీలు చూపిస్తూ ఆరోపణలు చేశారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

హిమాయత్‌నగర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు దరఖాస్తు ఫీజు తగ్గించిన తర్వాతే దరఖాస్తులు తీసుకోవాలని, 33 జిల్లాల్లో టెట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో టెట్, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.రాధారెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ.. టెట్ పరీక్ష దరఖాస్తు ఫీజు పెంపుతో పేద, మధ్యతరగతి అభ్యర్థులపై అధిక భారం పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో టెట్ ఒక పేపరు దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా ఉండేదన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం టెట్ పేపర్ ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్ల ఫీజును రూ.2,000 పెంచడం సరికాదని తెలిపారు. కేవలం 11 జిల్లా కేంద్రాల్లోనే పరీక్ష ఉంటుందని అధికారులు ప్రకటించారని, దీనివల్ల మిగతా జిల్లాల అభ్యర్థులకు దూరభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. మొత్తం 33 జిల్లాల్లోనూ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు లేకుండా పోటీపరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందని, ఇప్పుడు పెద్దమొత్తంలో ఫీజులు నిర్ణయించడం వలన నిరుద్యోగులు అసంతప్తితో ఉన్నారన్నారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి తీసుకుని తక్షణమే పెంచిన టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

ఫీజు మూడింతలు పెంచడం సరికాదు..

లిబర్టీ: పెంచిన టెట్ పరీక్ష ఫీజులు వెంటనే తగ్గించాలని దళిత బహుజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటుకల గణేశ్ డిమాండ్ చేశారు. సమైక్య కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్ పరీక్ష ఫీజులను రెండు మూడింతలు పెంచడం సమంజసం కాదన్నారు.

చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: చేవెళ్ల గడ్డపై మూడోసారి హ్యాట్రిక్‌గా బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నివాసంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో బీసీ సామాజిక వర్గానికి పెద్ద పీట వేశారని గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్ యాదవ్, సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు జేఎన్‌టీయూలో మెగా హెల్త్ క్యాంప్

బాలానగర్: జేఎన్‌టీయూలో ఎన్ఎస్ఎస్ యూనిట్ మార్చ్27,28తేదీల్లో యూనివర్సిటీ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. ఎస్. శోభారాణి తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో బీపీ ఆర్‌బీఎస్, బీఎంఐ, కార్డియాలజీ, ఈసీజీ ఏకో డెర్మాటాలజీ, కాస్మిటాలజీ, బోన్ డిస్నీ, డెంటల్ చెకప్, మహిళలకు కేన్సర్ చెకప్, బ్రెస్ట్ సోనోమమ్మోగ్రఫీ వంటి టెస్టులు నిర్వహించనున్నారు.ఈ హెల్త్ క్యాంపులో యూనివర్సిటీ, కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు చూపించుకోవచ్చని యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. ప్రసన్న తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా హెల్త్ క్యాంపులో అపోలో ఆస్పత్రి,వాసన్ ఐకేర్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వారు అనుభవజ్ఞులైన వైద్యులతో ఈ పరీక్షలు నిర్వహించనున్నారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎం. పద్మావతి తెలిపారు.

29 నుంచి బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం

లక్డీకాపూల్: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 29వ తేదీ నుంచి 31 వరకు ఘట్కేసర్‌లోని రాష్ట్రీయ విద్యా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలలో దేశంలోని సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. ముఖ్యంగా ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, బీడీ కార్మికులతో పాటు భవన నిర్మాణ రంగ కార్మికులు డొమెస్టిక్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చిస్తామన్నారు. సమావేశాలకు జాతీయ కార్య వర్గ నాయకులు హాజరవుతారని శ్రీనివాస్ తెలిపారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 13, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజీ 19, బీన్స్ 55, క్యారెట్ 19, గోబిపువ్వు 18, దొండకాయ 18, చిక్కుడుకాయ 48, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 70, ఆలుగడ్డ 25, కీరా 25, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 6, చిలగడ దుంప 19, గుమ్మడికాయ 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

టెక్నాలజీపై పట్టు పెంచుకోవాలి

రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయేష్‌రంజన్

హఫీజ్‌పేట్: మారుతున్న టెక్నాలజీపై పట్టు పెంచుకోవడం, దానికి మరింత ప్రాచుర్యం కల్పించడం ఎంతో అవసరమని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో గేమ్ చేంజర్ ప్లాట్‌ఫారమ్ 'ఈవెంట్ నీడ్'ను ఆయన లాంఛనంగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఈవెంట్ ఇండస్ట్రీకి వృత్తి నైపుణ్యం అవసరమన్నారు. మారుతున్న టెక్నాలజీ సవాళ్లను అధిగమించగలమనే నమ్మకం ఏర్పడాలన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి సంస్థలు అభివృద్ధి చెందడంతోపాటు మరిన్ని నగరాలకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీ హబ్ సీఓఓ అనీష్ ఆంథోని, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ ఎస్ గ్లోరీ స్వరూప, టీసీఈఐ అధ్యక్షుడు బలరామ్‌బాబు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'దళితుల ఐక్యతని దెబ్బతీసింది చంద్రబాబే'

లిబర్టీ: విభజించు, పాలించు అన్న విధానం ద్వారా గత ఉమ్మడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దళితుల్లో చిచ్చు పెట్టారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో మంగళవారం శ్రీకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను చంద్రబాబునాయుడు దెబ్బతీశారని ఆరోపించారు. దళితులు రాజ్యాంగ హక్కుల కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం 1995 వరకు సంఘటితంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ఎప్పుడైతే వర్గీకరణను కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటైందో, దాన్ని అదునుగా తీసుకొని నాటి సీఎం చంద్రబాబు దళితుల ఐక్యతను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మందకృష్ణ మాదిగ ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంత పాడుతారని ఆరోపించారు. తనకు తన ప్రయోజనాలు తప్ప దళిత జాతికి చేసింది ఏమీ లేదని ఈ సందర్భంగా విమర్శించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన బీజేపీకి మందకృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే ఆటలు అవసరం

భారత హాకీ టీమ్ కోచ్ సౌందర్య

రాయదుర్గం: విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠశాల స్థాయి నుంచే ఆటలు అవసరమని భారత హాకీ కోచ్ సౌందర్య పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గౌతమ్ మోడల్ స్కూల్ అల్కాపూర్, నార్సింగి బ్రాంచ్‌లు సంయుక్తంగా ఉత్కర్ష్ పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. పిల్లలు చురుగ్గా, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎం వెంకటనారాయణ మాట్లాడారు. అనంతరం గ్రాడ్యుయేషన్ డే కూడా నిర్వహించారు. కార్యక్రమంలో వర్ధమాన క్రికెటర్ ఆరోన్‌జార్జి వర్గీస్ , విద్యాసంస్థల కార్యదర్శి కేఆర్‌కే రెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్, భరత్, బిజినెస్ హెడ్ కె భరద్వాజ్, ప్రిన్సిపల్ సునీత, అనూష, ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితం

ప్రొ.మధుర స్వామినాథన్

పటాన్‌చెరు: భారతదేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, వ్యవసాయ వర్గ సంబంధాలపై చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ మధుర స్వామినాథన్ అన్నారు. బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్, ఆర్థిక విశ్లేషణ విభాగాధిపతి అయిన ఆమె మంగళవారం 'సమకాలీన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలు' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తమిళనాడులో గమనించిన మార్పులను ప్రస్తావించారు.గ్రామీణ రుణం, భూమి యాజమాన్యం, గ్రామీణ భారతంపై పెట్టుబడిదారీ విధానం వంటి సమస్యలను ఆమె వివరించారు. సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ రచించిన 'ట్రైబ్ క్లాస్ లింకేజ్: త్రిపురలోని రైతాంగ ఉద్యమ చరిత్ర, రాజకీయాలు' అనే పుస్తకాన్ని డాక్టర్ స్వామినాథన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకం త్రిపురలోని గిరిజన జనాభాలో వ్యవసాయ వర్గ సంబంధాల అభివృద్ధికి సంబంధించిన చారిత్రక అధ్యయనాన్ని వివరిస్తుంది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోటళ్లకు రేటింగ్స్ ఇవ్వాలంటూ మోసం

బాధితుడి నుంచి రూ.37 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా వేదికగా దేశంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక ప్రాంతాలు, ఇతర బ్రాండ్‌లకు ప్రమోషన్ చేయాలని చెప్పి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. సోషల్ మీడి యా, గూగుల్‌లో రేటింగ్స్ ఇస్తూ డబ్బు సంపాదించవచ్చని నమ్మిస్తూ ఓ బాధితుడికి వాట్సాప్‌లో సందేశం వచ్చింది. ఆ మెసేజ్ ద్వారా వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా.. అతడిని సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. గూగుల్‌లో రేటింగ్‌లు ఇవ్వాలని వివిధ టాస్క్‌లు ఇస్తూ ఆన్‌లైన్ ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. ఇందుకు గాను బాధితుడిని వేర్వేరు బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేయించారు. అనంతరం వివిధ చార్జీలు, మరిన్ని టాస్కుల పేరుతో బాధితుడి వద్ద డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అయితే, లాభాలు విత్ డ్రా కావడం లేదని బాధితుడు వారిని ప్రశ్నించగా అతని ఖాతాను నేరగాళ్లు బ్లాక్ చేశారు. కాగా, అప్పటికే విడతల వారీగా బాధితుడి నుంచి మొత్తం రూ.37,65,070 కాజేశారు. డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పంపాలని సైబర్ కేటుగాళ్లు వేధించారు. దీంతో బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తికి రిమాండ్

రహమత్‌నగర్: ప్రేమ పేరుతో మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన మనోహర్(36) మాదాపూర్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంటాడు. బోరబండకు చెందిన ఓ మహిళ అదే షాపింగ్ మాల్లో పని చేసేది. కాగా, సదరు మహిళను ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని మనోహర్ నమ్మించి శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. అంతేకాకుండా ఆమె నుంచి డబ్బులు సైతం తీసుకున్నాడు. అయితే, సదరు మహిళ తనను పెళ్లి చేసుకోవాలని మనోహర్‌పై ఒత్తిడి తీసుకోరావడంతో మోహం చాటేశాడు. ఈక్రమంలో తాను మోసపోయాయని అర్థం చేసుకున్న బాధితురాలు ఈ నెల 23న బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడు మనోహర్‌ను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు.

వ్యభిచార ముఠాను పట్టుకున్న ఎస్ఓటీ పోలీసులు

రూ.57 వేలు నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

మాదాపూర్: సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు వ్యభిచార ముఠాను పట్టుకుని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ కావూరిహిల్స్‌లోని వెస్ట్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 102లో వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి మేనేజర్, ముగ్గురు బాధితులు, ఇద్దరు కస్టమర్లు మొత్తం 6 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గౌడ తులిప్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌నెంబర్ 117, మాదాపూర్‌లో ఉంటున్న ఆర్గనైజర్, రంగని చైత్ర (33), గుంటూరుకి చెందిన మర్రి శివకుమార్(42) కస్టమర్, బెంగుళూరికి చెందిన రాంచందర్(64) కస్టమర్, బిహార్‌కి చెందిన పిట్ల పాస్మాన్(26) (మేనేజర్) మాదాపూర్‌లోని వెస్ట్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు . నిందితులతో బాటు నగదు రూ. 57,500, కండోమ్ ప్యాకెట్లు 10, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల నివారణకు పటిష్టమైన చర్యలు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

హిమాయత్‌నగర్: నగరంలో వీధి కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించేందుకు జీహెచ్‌ఎంసీ పటిష్టమైన చర్యలు చేపట్టిందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అడిషనల్ కమిషనర్ రవి కిరణ్, వెటర్నరీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై వీధి కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కల బారిన పడకుండా ప్రజలకు రక్షణ కల్పించేందుకు వెటర్నరీ శాఖ అధికారులు వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటి బర్త్ కంట్రోల్ (ఏ.బి.సి) చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీధి కుక్కలకు రెగ్యులర్‌గా వ్యాక్సిన్ వేయాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. కుక్కల దాడులు ఎందుకు జరుగుతున్నాయనే దానిపై అధ్యయనం చేయాలన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

దుకాణం షట్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా ఘటన



మృతుడు పవన్

భాగ్యనగర్‌కాలనీ: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం... బాలానగర్‌లో నివాసం ఉంటున్న పవన్ (35) అశోక్ ఫ్యాబ్రికేషన్ కంపెనీలో గత 12 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నం.1లోని వస్త్ర దుకాణంలో షట్టర్ సమస్య తలెత్తింది. దీంతో వస్త్ర దుకాణం నిర్వాహకులు పవన్‌ను పిలిపించారు. షట్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా షాపు వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో వెంటనే కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన పవన్‌ను స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డాక్టర్లు పోలీసులతో పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.